ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణభాస్కర

## (చించినాడలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 28-9-95)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం పెద్ద పనులు చేయలేకపోయినా చేసిన వారిని చూసి సంతోషిస్తే వారి పుణ్యంలో మనకు కూడా కొంత భాగము వస్తుంది. ఇది ఈశ్వరాజ్ఞ. ఎదుటివారు పచ్చగా ఉంటే మనం సంతోషించాలిగాని అసూయపడకూడదు. సంతోషిస్తే ఇహానికి, పరానికి కూడా లాభం. అసూయపడితే రెండు లోకాలలోనూ నష్టపోతాము. కృష్ణుడు గీతలో అర్జునుడితో నీవు అసూయలేనివాడవు, ఆ గుణం నన్ను ఆకర్షించింది. అందుచేత ఈ భగవద్గీతాశాస్త్రమును చెపుతున్నాను అన్నాడు.

కృష్ణుడు అంటే ఈశ్వరుడే. కృష్ణుడు ఎక్కడో పుట్టాడని, ఎక్కడో పెరిగాడని, ఎవడో బాణం వేస్తే ఆ బాణం దెబ్బకు చనిపోయాడని మనం అనుకుంటే మనం కూడా మాయలో పడినట్లే. కృష్ణుడు అంటే ఈశ్వరుడు. ఆయన ఎప్పుడూ మనతోటే ఉంటాడు. మనం మాయలో ఉన్నాము కాబట్టి కృష్ణుడు ఇప్పుడు లేడు అనుకొంటున్నాము. యమధర్మరాజు అజ్ఞానుల దగ్గర గర్వం చూపిస్తాడు గాని జ్ఞానుల దగ్గర గర్వం చూపించడు సరికదా నమస్కారం పెట్టి వెళ్ళిపోతాడు ఎందుచేతనంటే మరణంలేని వస్తువును జ్ఞాని అందుకున్నాడు కాబట్టి.

మనకు కష్టం వచ్చినపుడుగానీ, సుఖం వచ్చినపుడుగాని ఎగుడు దిగుడులు లేకుండా సమానంగా ఉండగలిగితే ప్రశాంత మనస్సు వస్తుంది. జీవితంలో హెచ్చు తగ్గులు వస్తూ ఉంటాయి. గౌరవం వస్తుంది, అగౌరవము వస్తుంది, ఓడిపోవటం జరుగుతుంది, నెగ్గటం జరుగుతుంది శరీరము వచ్చాక ఈ ద్వంద్వాలు తప్పవు. పూర్వ జన్మలో మనం చేసినవే మనకు ఎదురు వస్తాయి. ఎవరిమీదో నెపం పెట్టటం కంటే అది మనం అనుభవిస్తే పోతుంది. ధనం ఉండటం, లేకపోవటం చదువు ఉండటం లేకపోవటంతో సంబంధము లేదు. శాంతమైన మనస్సును మనం అలవాటు చేసుకోవాలి.

పూర్వ దేహమునకు ఈ దేహమునకు ఏమీ సంబంధము లేదు. దేహం మారిపోయింది, పరిసరాలు మారిపోయాయి, తల్లితండ్రులు మారిపోయారు. కాని పూర్వ దేహములో ఉన్న అలవాట్లు ఈ దేహమును నడిపిస్తున్నాయి. మన దేహమును మనం కంట్రోలు చేసుకోవటం లేదు. పూర్వ దేహంలో ఏ అలవాట్లు ఉన్నాయో ఆ అలవాట్లు ఈ దేహమును కంట్రోలు చేస్తున్నాయి. కొంతమందికి మంచి చేయాలని ఉంటుంది కాని చేయలేరు. ఎందుచేతనంటే పూర్వ దేహంలో ఉన్న అలవాట్లు వాడిని చెయ్యనివ్వవు. మన శరీరమునకు వయస్సు 50 గాని60 గాని సంవత్సరములు ఉండవచ్చు. కాని మన అలవాట్ల యొక్క వయస్సు ఎన్ని సంవత్సరాలో ఎవరూ చెప్పలేరు. కొన్ని వేల సంవత్సరాల నుండి వస్తున్న అలవాట్లు వేగముగా ఉంటాయి. మనం సాధన చేస్తున్నా ఆ సాధనాబలం సరిపోక అలవాట్ల యొక్క వేగము సాధనా బలంను ప్రక్కకు నెట్టి వేస్తుంది. ఈశ్వరానుగ్రహం వలన మాత్రమే మనం అలవాట్ల నుండి బయట పడగలము.

తమో గుణం ఉన్న వారికి, రజో గుణం ఉన్న వారికి, సత్వగుణం ఉన్న వారికి కూడా ఆలోచన ఉంటుంది. సత్వగుణం ఉన్నవాడు నిరంతరము దేవుని గురించి ఆలోచిస్తూ ఉంటాడు. భగవంతుని ఆధారముగా పెట్టుకుని జీవిస్తూ ఉంటాడు. రజోగుణం ఉన్నవాడు నిరంతరము తన పొట్టగురించి, బట్ట గురించి, వాడికి కావలసిన్న వారి గురించి ఆలోచిస్తూ ఉంటాడు. తమోగణం ఉన్నవాడు అదీ ఇదీ కాకుండా నిరంతరము విరోధులగురించి వారిమీద కక్ష ఎలా తీర్చుకోవాలి అని ఆలోచిస్తూ ఉంటాడు.

మనం మంచి విషయాలను భావన చేస్తే ఉన్నత స్థితికి వెళతాము. చెడ్డ విషయాలను భావన చేస్తే క్రింద పడిపోతాము. నీవు బాగుపడటమా, చెడిపోవటమా అనేది నీచేతులలోనే ఉంది. నేను విషయమును చెపుతున్నాను. అర్థంచేసుకొని బాగుంటే ఆచరించండి లేకపోతే మానివేయండి. ఆ స్వేచ్ఛ మీచేతిలో ఉంది. నేను చెప్పటం చెపుతున్నాను. ఆలోచించి, నిర్ణయం తీసుకొని పని చేయవలసింది నువ్వే.

ఏ జీవుడికైతే తమో, రజో గుణములతో సంబంధము తెగిపోయిందో ఎవడికైతే కల్మషం లేదో, పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఎవడైతే శాంతమనస్సు కలిగిఉన్నాడో, ఎవడైతే ఎప్పుడూ బ్రహ్మ భావన కలిగి ఉంటున్నాడో అటువంటి యోగిని ఉత్తమమైన సుఖము, శాంతి వచ్చివరిస్తాయి. వాటికోసం వెదకనక్కరలేదు. అవేవచ్చి వాడిని వరిస్తాయి.

నాకు సంబంధించిన పనిచెయ్యి. భౌతికమైన ప్రయోజనములను దృష్టిలో పెట్టుకుని పని చెయ్యవద్దు. ఈ పనిచేస్తే భగవంతుని అనుగ్రహానికి అర్హులమవుతాము అనుకుంటే ఆ పనిచెయ్యి. నీ దేహ ప్రారబ్దమును బట్టి కుటుంబము, పరిసరాలు, డబ్బు, చదువు, కీర్తి ఇవి అన్నీ వస్తాయి. ఇవి అన్నీ స్వప్న సమానము. నీవు ఎక్కడ ఉన్నా నన్నే గమ్యంగా పెట్టుకో. శరీరం వచ్చిందికదా శరీరమునకు సంబంధించిన నాటకం ఏదోవేసుకో. మీ ఇంటిలో పనిచేసే పనిమనిషిలా ఉండవద్దు. వాడు జీతం కోసం మీ ఇంటిలో పనిచేస్తాడు. వాడి మనస్సు ఎప్పుడూ వాడి ఇంటిలోని మనుషులపైన ఉంటుంది. నీవు అలా ఉండవద్దు. నీవు భక్తుడవు. నాకోసం పని చెయ్యాలి. నీ మనస్సులో కూడా నేనే ఉండాలి. నా నామమును స్మరించుకొంటూ, నా రూపమును ధ్యానించుకొంటూ నన్నే గమ్యంగా పెట్టుకొని పని చేయటం అలవాటు చేసుకో. నీవు నాకు భక్తుడుగా ఉండు. నాయందు ప్రేమకలిగి ఉండు. నాయందు ప్రీతి కలిగి ఉండు. నాయందు ప్రేమ లేకపోతే, ప్రీతి లేకపోతే భక్తికూడా కలుగదు అని పరమేశ్వరుడు చెపుతున్నాడు.

స్వామీ వివేకానంద భగవంతునితో నాకు మరల జన్మను ఇస్తానంటే 1. మనస్సుకు ఏకాగ్రత 2. సంఘరాహిత్యము ఇవి రెండూ ఇచ్చి ఈ భూమి మీదకు పంపించు. నాకు బాహ్యా చదువులు, సరదాలు అన్నీ అయిపోయినాయి. నాకు మరల జన్మవస్తే ఇవి రెండూ ప్రసాదించు అని భగవంతుని ప్రార్థించాడు.

మనస్సును ఏకాగ్రత చేయటమే నిజమైన విద్య. నీవు ఒకటో తరగతి చదివి ఉన్నప్పటినీ మనస్సులో ఏకాగ్రత ఉంటే నీవు ఘనమైన కార్యములు సాధించవచ్చును. ఎవరితోనూ మానసికంగా సంఘము పెట్టుకోవద్దు. ఎవరిపట్ల ఆసక్తి వద్దు.

సన్యాసికి, గృహస్తునికి ఒక తేడా ఉంది. సన్యాసికి ఉన్న స్వేచ్ఛ గృహస్తునికి ఉండదు. గృహస్థ జీవితంలో ఉన్న వాడికి కుటుంబం గొడవ ఏదో ఒకటి ఉంటుంది. అందువలన బాహ్యంగా స్వేచ్ఛ కోసం కొంతమంది సన్యాసం తీసుకొంటారు. అంత మాత్రము చేతవాడు జ్ఞాని అయిపోడు. అనుకొనేవాడు జీవుడు. సన్యాసి నేను సన్యాసిని అనుకొంటాడు. వాడూ జీవుడే. గృహస్థుడు నేను గృహస్థుడను అనుకొంటాడు.

వాడూ జీవుడే. లోపల ఉన్న బ్రహ్మ పదార్థము వాడికీ తెలియదు, వీడికీ తెలియదు. బ్రహ్మానుభవం పొందటానికి సంబంధించిన సాధన చేయటానికి సన్యాసజీవితములో ఎక్కువ స్వేచ్ఛ ఉంటుంది అని సన్యాసం పుచ్చుకొంటారు. సన్యాసి అయినంత మాత్రముచేత జ్ఞానం వస్తుంది అని ఎక్కడా లేదు. ఎందుచేత నంటే వాడు జయించవలసినది మనస్సును.

పనిచెయ్యటం, మరచిపోవటం. దీనినే బైబిల్‌లో నీ కుడి చేయి చేసేపనిని ఎడమ చేయికి తెలియనివ్వకు అని చెప్పాడు. భగవంతునికి ఇష్టమైన పని చెయ్యి. దాని వలన నీవు భౌతికంగా ఆశించేది ఏమీలేదు. నిన్ను అనుగ్రహించేవాడు భగవంతుడు. అందువలన ఆయన అనుగ్రహం కోసం పనిచేసి మర్చిపో. మర్చిపోతే అది నిన్ను చుట్టుకోదు. ఎవడికి ఇష్టమైన పనిని వాడు చేస్తే వాడు భోగి అయితే అవ్వవచ్చును. వాడికి ఇష్టం లేకపోయినా భగవంతునికి ఇష్టమైన పనిని చేస్తే వాడు యోగి అవుతాడు. భోగం వేరు. యోగం వేరు.

ఎవరిమీద విరోధం పెట్టుకోవద్దు. ఎవరి మీద అయినా విరోధం పెట్టుకుంటే వారే జ్ఞాపకం వస్తూ ఉంటారు. దీని వలన తమోగుణం పెరిగిపోతుంది. తమో గుణం వలన అజ్ఞానంలో కూరుకొనిపోతాము. విరోధం వలన నీ శరీరము, మనస్సు నీకు బరువైపోతాయి. అందువలన ఎవరిమీద విరోధం పెట్టుకోకూడదు.

కత్తితో నీ శరీరము మీద కోస్తే ఎంత బాధ కలుగుతుందో కొంతమంది మాట్లాడితే అంత బాధ కలుగుతుంది. అటువంటి వారునోరు మూసుకొని ఉంటే బాగుంటుంది. కాని వారు మూసుకోరు. భారత యుద్ధం జూదం వలన రాలేదు ఒకే ఒక్క మాటవలన వచ్చింది. మయసభలో దుర్యోధనుడు నీరులేని చోట నీరు ఉందని భ్రమించి పంచెపైకి పట్టుకొని వెళుతూఉంటాడు. అది చూసి ద్రౌపతి మౌనంగా ఉంటే ఏమీ లేదు. కాని గుడ్డివాని కొడుకు గుడ్డివాడే అంది. ఆ మాటతో కక్షలు ప్రారంభమయినాయి. ద్రౌపతి ఆమాట అనటం పొరపాటు. ఎంతమంచి వారికైనా ఒకోసారి నోరు జారుతుంది. అది దుర్యోధనుడు మర్చిపోతే ఏమీలేదు. ఆయన మర్చిపోలేదు. దానితో కక్షలు పెరిగి యుద్ధాలు జరిగాయి. అందువలన మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

భగవంతుని పనిచేయటం అంటే అందరిలోనూ ఆయననే చూడటం. రంగులు, గుణాలు, ఆకారాలు చూడకూడదు. ఇవి చూస్తూ ఉంటే లోపల ఉన్న ఈశ్వరుడు కనబడడు. వీటి గొడవ ఎందుకు ఇవి అన్నీ కాల గర్భంలో కలిసిపోతాయి. లోపల ఆధారంగా ఉన్న ఈశ్వరుడినే చూడు. వాడిని గుర్తుపెట్టుకొని పని చెయ్యి. బాహ్యరూపములను గుర్తులో పెట్టుకొని పనిచేస్తే వారివలన ఉపకారం ఆశించకపోయినా కృతజ్ఞత అయినా ఆశిస్తావు. వారు మెచ్చుకోవాలి అని చూస్తావు. లోపల ఉన్న ఈశ్వరుని గుర్తులో పెట్టుకొంటే వారు మెచ్చుకోవాలి అనే భావన నీకు ఉండదు. వాడిలో ఉన్నవాడు నీలో ఉన్నవాడు ఒక్కడే. నిన్ను నీవు ఏమి మెచ్చుకొంటావు.

మనం కారులో ప్రయాణం చేస్తున్నాము అనుకోండి. అక్కడ ఒక సీటు ఖాళీగా ఉంటే ఇద్దరము కూర్చోలేము, ఒక్కరమే కూర్చోగలము. అలాగే నీకు ఉన్నది ఒకటే హృదయము. అక్కడ ఉంటే దేవుడు అయినా ఉండాలి లేక అహంకారము అయినా ఉండాలి. రాజీలేదు. కాని నీవు ఇద్దరినీ కూర్చోబెట్టటానికి ప్రయత్నము చేస్తున్నావు. ఒకే సీటులో ఇద్దరిని ఎలా కూర్చోబెడతావు. నీకు దేవుడు ఇష్టమైతే దేవుని కూర్చోబెట్టుకో లేకపోతే అహంకారము ఇష్టమైతే అహంకారమును కూర్చోబెట్టుకో.

మీ హృదయంలో నాకు కొంత చోటు ఇవ్వండి అని భగవంతుడు అడుగుచున్నాడు. మన దుఃఖమును

పోగొట్టటమే కాకుండా ఆయనకు ఉన్న ఆనందమును మనకు ఇవ్వటం కోసం మీ హృదయంలో కొంత చోటు ఇవ్వండి అని భగవంతుడు అడుగుచున్నాడు.

చాలామంది మాకు భయం వేస్తోంది అని చెపుతూ ఉంటారు. అలా భయం వేసేవారికి భగవంతుని మీద భక్తి కుదరలేదు అని అర్థము. నిజమైన భక్తునికి భయం కలుగదు. ఎందుచేతనంటే దేవుడనేవాడు ఉన్నాడు, వాడు రక్షిస్తాడు అనుకొంటాడు. భయం కలుగుతూ ఉంటే భగవంతుని మీద విశ్వాసము లేదనిగుర్తు. భక్తుడికి భయంకలుగదు. భగవంతుని మీద వాడికి ఉన్న విశ్వాసము భయరహితునిగా చేస్తుంది.

నాకోసం పనిచేసేవాడు, నన్నే గమ్యంగా పెట్టుకొన్నవాడు, సర్వజీవులపట్ల వైరబుద్ధి లేనివాడు, ప్రపంచములోని ఏ విషయములపట్ల ఆసక్తి లేనివాడు, నా భక్తుడు నన్ను పొందుతాడు. ఓ అర్జునా! నీవేకాదు ఈ భూమిమీద ఈ లక్షణములు ఉన్నవారు ఎవరైనా నన్ను పొందుతారు అని పరమాత్మ చెప్పాడు. నన్ను అంటే బ్రహ్మంను పొందుతారు. ఎవడికైతే ఇంద్రియనిగ్రహం లేదో, ఎవడికైతే మనోనిగ్రహం లేదో, ఎవడికైతే ధ్యానం చేసే అలవాటు లేదో వాడికి బుద్ధిలేదు అని చెపుతారు. బుద్ధి లేదు అంటే తెలివిలేదు, వివేకములేదు, జ్ఞానంలేదు. మీరు కొంత ప్రయత్నం చేసి అంటే పుణ్యనదులలో మునిగి, ఉపవాసములు చేసి, పూజలు చేసి కొంత జ్ఞానమును సంపాదించారు అనుకోండి మీకు ఇంద్రియ నిగ్రహం లేకపోతే మీరు సంపాదించినది అంతా పోతుంది అని భగవంతుడు చెపుతున్నాడు.

నీవు దానం చేయాలనుకుంటే శాంత స్వభావము కలవాడికి దానం చెయ్యి. వాడు ఏకులం వాడు అయినా శాంత స్వభావము కలవాడికిదానంచెయ్యి. వాడు విషయలోలుడు అయి ఉండకూడదు. విషయలోలుడు అయితే నీవు ఇచ్చిన డబ్బును విషయాలకు ఖర్చు బెడతాడు. సినిమాలు చూసే అలవాటు ఉన్నవాడికి 100 రూపాయలు ఇస్తే ఆ డబ్బును వాడు సినిమాలు చూడటానికి ఖర్చుపెడతాడు. అంటే నీవు ఇచ్చిన డబ్బు వాడిలోని గుణములు ప్రకోపించటానికి ఉపయోగపడింది. నీవు ఇచ్చిన డబ్బు చెడ్డకు ఉపయోగపడింది. అందువలన ఆ దోషమును నీవు కూడా భరించవలసి వస్తుంది అని పరమాత్మ చెపుతున్నాడు.

నీ హృదయంలో ఒక జ్ఞాన భాండారము ఉంది. అమృతస్థితి ఉంది. దానిని నీవు కనిపెట్టవలసిన పనిలేదు. అది ఇంతకు ముందే అక్కడ ఉంది. అది ఎక్కడ ఉందో ఆ తలుపులు తీయాలి. దానికి తాళం చెవి కావాలి. ఏకాగ్రత అనేది దానికి తాళం చెవి. ఏకాగ్రత అనే తాళం చెవిని సంపాదిస్తే ఆ తలుపులను తీసుకోవచ్చును అని స్వామీజీ చెప్పారు. Concentration is the only key to the treasure house of knowledge

ఇంద్రియ నిగ్రహం, మనో నిగ్రహం ఉన్నవాడిని యుక్తుడు అంటారు. యుక్తునకు ఏకాగ్రత వస్తుంది. భావనాబలం వస్తుంది. ఇంద్రియ ఇగ్రహం లేకపోతే ఏకాగ్రత సంపాదించాలన్నా సంపాదించలేడు. భావనా బలం కూడా రాదు. మనస్సులో భావనాబలం ఉన్నవాడు ఏదైనా సాధించగలడు. ఏకాగ్రత లేనివాడికి, భావనా బలంలేనివాడికి శాంతిలేదు. నీకు బాహ్యంగా ఉన్న వస్తువులమీద నీశాంతి ఆదారపడి లేదు. నీ ఏకాగ్రత మీద నీ శాంతి ఆధారపడి ఉంది. కొంతమందికి ఇంట్లో ఎంతో డబ్బు ఉంటుంది గాని ఎప్పుడూ అశాంతిగా ఉంటారు. దీనికి కారణం వారికి భావనాబలం లేదు. భావనాబలం లేనపుడు నీకు శాంతి దొరకదు. శాంతి లేనపుడు నీకు సుఖం లేదు.

ఎందుకు ఈ శవాలతో తాదాప్యం పొందుచున్నావు. ఈ శవాలతో తాదాప్యం పొంది నేను పుట్టాను, నేను చనిపోయాను అనుకొంటున్నావు. ఉన్న వస్తువును మర్చిపోతున్నావు. కర్మ చేయటం, అనుభవించటం

నీవుకాని శవాలతో తాదాత్మ్యం వలన ఈ అడవి గొడవలు అన్నీ వస్తున్నాయి. నీవు ఎవడివో దానితో తాదాత్మ్యం వలన నీకు సుఖం, శాంతి కలుగుతుంది.

వయస్సులో ఉండగా మాకు భక్తిలేదు. అనుభవించవలసిన భోగాలు అనుభవించాము. ఇప్పుడు ముసలివయస్సు వచ్చింది. ఇప్పుడు భక్తి గురించి ఆలోచన వస్తోంది అని చాలామంది అంటున్నారు. ఏ వయస్సులో ఆ సంస్కారము వచ్చినా మొదలు పెట్టండి. ఎంత పెద్ద వయస్సులో భక్తిని ప్రారంభించినా అది తరువాత జన్మకు వచ్చేస్తుంది. మీరు చేసినది మీకే వచ్చేస్తుంది. ఇది భగవంతుడు ఇచ్చిన హామీ. అందువలన ఏ వయసులో భక్తి కలిగినా మొదలు పెట్టండి, దానిని అభివృద్ధి చేసుకోండి.

మనం ఎంత దుర్మార్గుడి గురించి చెప్పినా వాడిలో ఉన్న మంచి గుణం గురించి చెప్పేవారు భగవాన్. భగవాన్‌లో ఉన్న ప్రత్యేకత అది. తిరువన్నామలైలో ఎవరో దుర్మార్గుడు చనిపోతే వాడిలో చెడ్డను గురించి అందరూ చెపుతూ ఉంటే వాడు రోజుకు మూడుసార్లు స్నానం చేసేవాడు. శుభ్రంగా ఉండేవాడు. వాడిలోని శుభ్రత అనే గుణంను తీసుకొందాము అన్నారు. దేవుని తరువాత దేవునితో సమానమైనది శుభ్రత.

మీకు శరీరములు వస్తున్నాయి. పనులు చేస్తున్నారు. పుణ్యమో, పాపమో అనుభవిస్తున్నారు. ఈ చక్రం అలాగే తిరుగుతూ ఉంటుంది. ఈ ప్రకృతి మిమ్మలను విడిచిపెట్టదు, జీవలక్షణములు విడిచిపెట్టవు. ఈ చక్రములో నుండి మీరు బయటకు రావాలి అంటే శాశ్వతమైన శాంతి స్థానము నేనే. నన్ను విడిచి పెట్టి శాంతి లేదు, సుఖం లేదు. మీరు నన్ను తెలుసుకుంటే శాంతి దొరుకుతుంది. నేనే శాంతిని, నేనే సుఖాన్ని. నేను అంటే బ్రహ్మమే. భక్తి వలన గాని జ్ఞానం వలన గాని, నిష్కామకర్మవలన గాని మీకు బ్రహ్మానుభవం కలిగితే మృత్యువు కూడా మీకు బయపడిపారిపోతుంది. దేహభావన ఉన్నవాడి దగ్గర మృత్యువు తన గర్వం చూపిస్తుంది గాని బ్రహ్మభావన ఉన్న వాడి దగ్గర తోక ముడిచివేస్తుంది.

మీ దేహ యాత్ర సాగటానికి సరిపడ పనులు చేసుకోండి. ఆత్మ విశ్వాసమును పెంచుకోండి. నామీద విశ్వాసమును, భక్తిని పెంచుకోండి. నా మీద విశ్వాసము పెంచుకుంటే మీరు భయరహితులు అవుతారు. మీ దేహ ప్రారబ్ధమును బట్టి పరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా వ్యతిరేకంగా ఉన్నా మీ విశ్వాసము చెలించకుండా చూసుకోండి. మీరు విశ్వాస హీనులుగా ఉండవద్దు. మీరు విశ్వాస రహితులుగా ఉండవద్దు. మీరు విశ్వాస పూర్ణులుగా ఉండండి. అప్పుడు నా అనుగ్రహానికి పాత్రులవుతారు. అప్పుడు ఏకాగ్రత అనే తాళం చెవి మీకు దొరుకుతుంది.

Find the root and cut the root అని చెప్పారు. వేరు ఏదో తెలుసుకో. అప్పుడు వేరును కోసి వెయ్యి. వేరు ఏమిటి అంటే అహంకారము. నీకు ఉన్న మిగిలిన గొడవలు అన్ని ఆకులు, రొబ్బలు, పుష్పాలు, ఫలాలు. ఆకులు, రొబ్బలు పోయినంత మాత్రంచేత చెట్టుపోదు. అవి మరల వస్తూ ఉంటాయి. వేరు ఎక్కడ ఉందో చూసి దానిని కోసివెయ్యాలి. అలాగే అహంకారము నశించేవరకూ రావటాలు, పోవటాలు, జన్మలు, ప్రకృతి గొడవలు తప్పవు. ఎందుకంటే అహంకారము దేహము లేకుండా ఉండలేదు. నీ దుఃఖ కారణము ఎక్కడ ఉందో ముందు చూడు. దానిని కోసివెయ్యి.

దీపం, దీపం అంటే వెలుతురు రాదు. దీపమును వెలిగించుకొంటే వెలుతురు వస్తుంది. అలాగే హృదయంలో దేవుడు ఉన్నాడు అని అంటే దేవుడు దొరకడు. హృదయంలో మునగాలి. దానికి వైరాగ్యం కావాలి. వైరాగ్యం కావాలంటే అభ్యాసం చెయ్యాలి. అభ్యాసం చేస్తే దేవుని అనుగ్రహం వస్తుంది. అప్పుడు

నీవు వైరాగ్య స్వరూపుడవు అవుతావు.

వైరాగ్యములో చేదు ఉంది అనుకొంటున్నారేమో కాదు వైరాగ్యంలో సుఖం ఉంది. వైరాగ్య సుఖమును రుచి మరిగిన వాడు వైరాగ్యమును విడిచిపెట్టడు. అందువలన వైరాగ్యమును ప్రాక్టీసు చెయ్యి. వైరాగ్యము వలన మనస్సుకు తూకం పెరుగుతుంది. ఎప్పుడైతే వైరాగ్యం వచ్చిందో వాడు హృదయంలోనికి మునిగిపోతాడు. హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు. జీవుడు హృదయంలోనికి వెళ్ళి అక్కడ ఉన్న ఈశ్వరుని చూసిన వెంటనే కరిగిపోతాడు. అప్పుడు ఈశ్వరుడే నేనుగా వ్యక్తమవుతాడు. ఎవడైతే తన అహంకారమును పోగొట్టుకున్నాడో అంటే వాడిని వాడు నష్టపరచుకున్నాడో వాడికి నా స్వరూపమును ఇస్తాను అని పరమాత్మ చెపుతున్నాడు.

నీ అహంకారము కోసం జీవించకు. నాకోసం జీవించు. నాభావన కలిగి ఉండు. దానివలన నీకు భావనా బలం వస్తుంది. భావనా బలం ఉన్న వాడికి శాంతి వస్తుంది. శాంతి వలన సుఖం వస్తుంది. అది ఉత్తమ సుఖము. అది పరిణామంలో దుఃఖమును తీసుకొని రాదు. అది బాహ్య విషయములతో సంబంధము ఉన్న సుఖం కాదు. ఇంద్రియగతమైన సుఖంకాదు. అది ఉత్తమ సుఖము.

ఒక పాల వ్యాపారి ఉన్నాడు. అతను భక్తుడు. రోజూ గుడికి వెళతాడు, పూజలు చేస్తాడు. అతనికి వ్యాపారం చేసేటప్పుడు నీరులో పాలు కలపటం అలవాటు. ఒకరోజు భగవంతుడు కనబడి నీవు నాకోసం పూజలు చేస్తున్నావు. కాని నీవు చేసే వ్యాపారమును నేను చూడలేక పోతున్నాను. పాలలో కొద్దిగా నీరు కలపటం కాదు నీవు నీటిలో పాలు కలుపుతున్నావు. ఇలా కాదు నీకు పెట్టుబడి లేకుండా నీకోసం ఒక పాల చెరువును సృష్టిస్తాను. నీ కుటుంబ యాత్రకు సరిపడే పాలను అందులో నుండి తీసుకొని వ్యాపారం చేసుకో అని చెప్పాడట. మీరు పాల చెరువును సృష్టిస్తాను అంటున్నారు. దానితోపాటు దాని ప్రక్కనే నీరు ఉన్న చెరువును కూడా సృష్టించండి. నా అలవాటు ప్రకారము రెండూ కలిపి పట్టుకొని పోతాను అని అన్నాడట. మనుష్యుల యొక్క అలవాట్లు ఎలా ఉంటాయో తెలియజెయ్యటానికి ఇది కృష్ణుడు చెప్పాడు. వాడి అలవాటు యొక్క వేగం వలన కృష్ణుని అనుగ్రహాన్ని కూడా పట్టుకోలేక పోతున్నాడు. మనమూ అంతే. పెట్టుబడి లేకుండా పాలు అమ్ముకునే ఉపాయమును భగవంతుడు చూపిస్తున్నాడు. అయినా నీరు కలపటం మానను అంటున్నాడు. అలవాటు యొక్క వేగము అలా ఉంటుంది. మన దేహమును మనం కంట్రోల్ చేసుకోవటం లేదు. పూర్వ దేహములో ఏ అలవాట్లు వచ్చాయో ఆ అలవాట్లు ఈ దేహమును కంట్రోల్ చేస్తున్నాయి. ఇది బాగా గుర్తు పెట్టుకోండి.

సిగరెట్లు కాల్చే అలవాటు ఉన్న ఒక పేషంట్‌తో డాక్టరు మీరు సిగరెట్లు మానకపోతే మీరెండు కాళ్ళు తీసివేయవలసి ఉంటుంది. మీ లోపల అటువంటి జబ్బులు ఉన్నాయి అని చెపితే నా రెండు కాళ్ళు పోతాయని సిగరెట్లును ఎలా వదులుకోమంటారు అని అన్నాడట. కాళ్ళు పోగొట్టుకోవటానికి కూడా సిద్ధపడుతున్నాడు. అంటే వాడి కాళ్ళకంటే వాటి అలవాటు అంటేనే అతనికి ఎక్కువ ప్రియం అన్న మాట. ఈ అలవాట్లు, బంధాలు, కష్టలనుండి ఈశ్వరానుగ్రహం లేకుండా బయట పడలేము. ఈ బంధాలను వదల్చటానికి ఆయనే రావాలి. ఆయన వచ్చి వీటిని ఊడగొట్టాలి గాని మన తెలివి తేటల వలన, వంకర నమస్కారముల వలన అవి పోయేవికావు. భగవంతుడు నీ నమస్కారమును చూడడు. ఎందుకు నమస్కారములు పెడుతున్నావో చూస్తాడు. నీ భావనను చూస్తాడు.